సాక్షి సిద్దిపేట

మంగళవారం । 6 । మే । 2025



రెగ్యులర్ ఈవో కలేనా!

ఏడుపాయల ఆలయానికి రెగ్యులర్ ఈవో నియామకం కలగానే మిగిలిపోతుంది.

వివరాలు 8లో ▸



అసైన్డ్ భూముల కబ్జా

ప్రభుత్వం పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను కొందరు కబ్జాలకు పాల్పడుతున్నారు.

వివరాలు 8లో ▸



తాగునీరు కరువాయె..

అక్కన్నపేట మండలంలోని ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల్లో కనీస వసతులు కరువయ్యాయి.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

కేంద్ర మంత్రి గడ్కరీకి మంత్రి పొన్నం లేఖ

నాలుగు లేన్ల రోడ్డుగా మార్చాలంటూ వినతి

హుస్నాబాద్: కేంద్ర జాతీయ రహదారులు, రోడ్లు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖ రాశారు. హుస్నాబాద్ నుంచి జనగామ వరకు డబుల్ లేన్ రోడ్డుగా ఉన్న 52 కి.మీ. రహదారిని నాలుగు లేన్లుగా అప్‌గ్రేడేషన్ చేయాలని లేఖలో కోరారు. జిల్లా రోడ్‌ను అప్‌గ్రేడ్ చేస్తూ నేషనల్ హైవే రోడ్డుగా మార్చడం వల్ల హుస్నాబాద్ నియోజకవర్గంలో రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని మంత్రి పొన్నం లేఖలో పేర్కొన్నారు.

ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోండి

కలెక్టర్ మనుచౌదరి



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

కోహెడరూరల్(హుస్నాబాద్): కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. సోమవారం మండలంలోని బస్వాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రంలో గన్ని బ్యాగులు, తేమ కొలిచే యంత్రాలు, వెయిట్ మిషన్లు, ప్యాడీక్లీనర్లను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం తడవకుండా టార్పాలిన్ షీట్‌లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. తేమశాతం రాగానే వెంటనే లోడ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని అక్కడి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సివిల్ సప్లై డీఎం ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ అందె గణేశ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎంపీసీ, బైపీసీ, సీఈసీలలో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈనెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని అన్నారు.

నేరుగా ప్రవేశాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పదో తరగతి ఉత్తీర్ణత సాధించి, గురుకులాల్లో ఇంటర్ చదువుకోవాలనుకునే విద్యార్థులకు ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండానే ప్రవేశాలు కల్పిస్తున్నారు. మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకులాల్లో నేరుగా ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఎస్ జిల్లా కన్వీనర్ మహాదేవుని శివప్రసాద్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కల్గిన విద్యార్థులు ఈనెల 12లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేల తల్లి ఆరోగ్యం కాపాడండి

శాస్త్రవేత్త డాక్టర్ శ్రీదేవి

హుస్నాబాద్: యూరియా వాడకాన్ని తగ్గించి నేత తల్లి ఆరోగ్యాన్ని కాపాడాలని ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.శ్రీదేవి పిలుపునిచ్చారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో సాగు పద్ధతులు, వారిని వానాకాలం సాగుకు సమాయత్తం చేసేందుకు 'రైతు ముంగిట శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. తోర్నాల ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీదేవి మాట్లాడుతూ విత్తనాలు కొనుగోలు చేసిన రశీదులను రైతులు భద్రపర్చుకోవాలన్నారు. సాగునీటిని ఆదాచేసే పరిజ్ఞానం, ప్రత్యామ్నాయ పంటల వివరాలు, చెట్ల పెంపకంపై వివరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఫోన్ ద్వారా రైతులను ఉద్దేశించి మాట్లాడారు. రైతులు సాగు ఖర్చును తగ్గించుకొని వ్యవసాయంలో శాస్త్రీయ మెలకువలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, డివిజన్ వ్యవసాయ అధికారి శ్రీనివాస్, శాస్త్రవేత్త పల్లవి, వ్యవసాయ పాలిటెక్నిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజా, డైరెక్టర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త శ్రీదేవి





సిద్దిపేట మార్కెట్ యార్డులో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఆరబోసిన రైతులు

అన్నదాత ఆగం

యాసంగి సీజన్ రైతులకు నష్టాలే మిగిల్చింది. అకాల వర్షాలతో తీరని నష్టం కలిగింది. విత్తుకు, మందుకు అప్పుతెచ్చి.. ఎండనకా వాననకా చెమటోడ్చి.. కంటికి రెప్పలా కాపాడుకున్న ధాన్యం కళ్లెదుటే కొట్టుకుపోయింది. అన్నదాతల ఆశలపై అకాల వర్షం ఒక్కసారిగా నీళ్లు చల్లింది. ధాన్యం ఆరబెట్టుకునేందుకు చోటులేక.. సకాలంలో కొనుగోళ్లు జరగక.. నోటికాడి ముద్ద చేజారడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ఆరు మార్లు కురిసిన అకాల వర్షాలకు 15వేల ఎకరాలు నష్టం వాటిల్లింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

అకాల వర్షాలతో తీరని నష్టం

- ఈ యాసంగిలో ఆరుసార్లు కురిసిన వాన
- వర్షం ధాటికి కొట్టుకుపోయిన ధాన్యం
- 15వేల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- ఆదుకోవాలంటూ రైతుల వేడుకోలు

సాక్షి, సిద్దిపేట: జిల్లావ్యాప్తంగా మార్చి నుంచి ఇప్పటి వరకు అకాల వర్షాలతో 15,625 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఆదివారం సాయంత్రం కురిసిన వానకు ఏకంగా 9,368 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. అధికంగా కొండపాక, మిరుదొడ్డి, నంగనూరు మండలాల్లోని రైతులు ఎక్కువగా నష్టపోయారు. దీంతో రైతులు కన్నీటిపర్యంతమయ్యారు. ఎకరాకు రూ.10వేలు ఇస్తామని గతంలోనే ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఇప్పటి వరకు పరిహారం ఇవ్వలేదు. నష్టం జరిగిన వారి వివరాలను ప్రభుత్వానికి వ్యవసాయ శాఖ ఇప్పటికే నివేదికను పంపింది.

నష్టపరిహారం కోసం..

అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం కొట్టుకుపోయింది. ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో టార్పాలిన్లు కప్పినా ఫలితం లేకపోయింది. కొనుగోళ్లకు ఆదివారం సెలవు ప్రకటించకుండా కొనుగోలు చేసి ఉంటే వడ్లు తడిసేవి కావని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, అలాగే కొట్టుకుపోయిన ధాన్యానికి సైతం నష్టపరిహారం అందించాలని వారు కోరుతున్నారు.





మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యం

ధాన్యం వద్ద పడిగాపులు



అకాల వర్షానికి కొనుగోలు కేంద్రంలో నిల్వచేసిన ధాన్యం తడిసి ముద్దయింది. వారం రోజుల క్రితం ధాన్యాన్ని కేంద్రానికి తీసుకువచ్చినా తూకం వేయడంలో జాప్యం జరుగుతోంది. దీంతో ధాన్యం కుప్పల వద్ద పడిగాపులుకాస్తున్నాం. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకోవాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, పెద్దకోడూరు

కళ్లముందే కొట్టుకుపోయింది



ఆరుగాలం కష్టపడి పండించిన పంట అకాల వర్షానికి కళ్లముందే కొట్టుకుపోయింది. ధాన్యం వర్షం నీటిలో కొట్టుకుపోతుంటే ప్రాణం తల్లడిల్లింది. చేసేది లేక బిక్కు బిక్కు మంటూ చుస్తూ కూర్చున్నాం. పెట్టుబడికి కోసం చేసిన అప్పులు ఎలా తీర్చేది? ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి.

–కట్కూరి రామచంద్రం, రైతు దుబ్బాక

రోడ్డెక్కిన రైతులు

- తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలంటూ ధర్నా
- స్తంభించిన గజ్వేల్– చేగుంట రహదారి



గుర్రాల సోఫా వద్ద రోడ్డుపై ధర్నా చేస్తున్న రైతులు

దుబ్బాకటౌన్: తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలంటూ రైతులు రోడ్డెక్కారు. సోమవారం గజ్వేల్ చేగుంట రహదారిపై గుర్రాల సోఫా వద్ద రైతులు రోడ్డుపై బైఠాయించి మూడు గంటల పాటు ధర్నా నిర్వహించారు. ఫలితంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాయపోల్ మండలంలోని రామారం, సయ్యద్ నగర్ గ్రామాల్లో ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వడగళ్ల వానతో కోతకు వచ్చిన వరి పంట పూర్తిగా నేల రాలింది. మరోవైపు కొనుగోళ్ల కేంద్రాల వద్ద ధాన్యం తడిసిపోయింది. తడిసిన ధాన్యాన్ని తక్షణం కొనుగోలు చేయాలంటూ ఆందోళనకు దిగారు. ఈదురు గాలులు, వడగళ్ల వానతో పంట పూర్తిగా నేలరాలినప్పటికీ అధికారులు ఇటువైపు తొంగి చూడడం లేదంటూ రైతులు వాపోయారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్ళముందే దెబ్బతినడంతో పెట్టుబడులు కూడా రాలేని పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న రాయపోల్, దౌల్తాబాద్ పోలీసులు అక్కడికి చేరుకొని రైతులను సముదాయించే ప్రయత్నం చేసినా వారు వినిపించుకోలేదు. వ్యవసాయ శాఖ అధికారులు వచ్చి తమకు స్పష్టమైన హామీ ఇచ్చేవరకు ధర్నాను విరమించేది లేదని తేల్చి చెప్పారు. దీంతో మండల వ్యవసాయ శాఖ అధికారి నరేష్, ఆర్ఐ భాను, దౌల్తాబాద్ ఎస్ఐ ప్రేమ్‌దీప్ రైతులను సముదాయించి ధర్నాను విరమింపజేశారు.

ఈ పాపం అధికారులదే

- ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర నిర్లక్ష్యం
- వేగిరం చేసి ఉంటే ఈ దుస్థితి ఉండేదికాదు
- ఎమ్మెల్యే హరీశ్‌రావు ఫైర్
- సిద్దిపేట మార్కెట్ యార్డులో బాధిత రైతులకు ఓదార్పు



మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: 'సిద్దిపేట మార్కెట్ యార్డులో వందల సంచుల కొద్దీ ధాన్యం ఉంది.. త్వరితగతిన తూకం వేసి.. ధాన్యం లిఫ్ట్ చేస్తే ఈ సమస్య ఉండేది కాదు.. రైతులకు సమస్యలు రాకుండా అప్రమత్తంగా ఉండాల్సిన మీరు బాధ్యత లేనట్టుగా ఉండొద్దు. మళ్లీ సమస్య రాకుండా చూడాలి. మీరు ఇక్కడే ఉండి తూకం వేయిస్తారా? లేదా నన్ను ఇక్కడే ఉండమంటారా? అని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అధికారులపై మండిపడ్డారు. అకాలవర్షంతో ధాన్యం తడిసిన నేపథ్యంలో ఆయన సోమవారం హైదరాబాద్ నుంచి నేరుగా సిద్దిపేట యార్డుకు చేరుకున్నారు. యార్డులో వర్షానికి తడిసి ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించారు. బాధిత రైతులను ఓదార్చారు.

మొత్తం నీటిపాలైంది..

కష్టపడి పండించిన పంట చేతికి వచ్చాక మాయదారి వానతో మొత్తం నీటిపాలైందని బాధిత రైతులు ఎమ్మెల్యే హరీశ్‌రావుతో ఆవేదన వ్యక్తంచేశారు. కనకవ్వ, అంజవ్వలను ఎమ్మెల్యే పరామర్శించారు. ధాన్యం తీసుకువచ్చి వారం రోజులు అయ్యిందని, కొనుగోళ్లు జరగక ఇబ్బంది పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక దశలో అధికారులను పిలిచి కొనుగోళ్ల జాప్యంపై ఎమ్మెల్యే ఆరా తీశారు. అక్కడే ఉన్న డీఎస్‌ఓ తనూజ, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, మార్కెట్ శాఖ సెక్రటరీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హమాలీల, లారీల సమస్య ఉందని వారు ఎమ్మెల్యే దష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆర్డీఓ, తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. యార్డులో 3500 బస్తాలు ఎగుమతి చేయడానికి లారీలు లేవా అని ప్రశ్నించారు. జాప్యం చేస్తే తడిసిన ధాన్యం మొలకలు వచ్చే ప్రమాదం ఉందని, తడిసిన ధాన్యాన్ని యార్డునుంచి మిల్లుకు ఎగుమతి చేయాలని సూచించారు. తూకం వేయని ధాన్యాన్ని త్వరితగతిన తూకం వేయాలన్నారు. ఒకదశలో లారీ అసోసియేషన్ వారితో ఫోన్‌లో మాట్లాడి లారీల సమస్య లేకుండా చూడాలని సూచించారు.

ప్రభుత్వం పరిహారం చెల్లించాలి



దర్గపల్లిలో రాలిన మామిడి కాయలను పరిశీలిస్తున్న హరీశ్‌రావు

నంగునూరు(సిద్దిపేట): పంట నష్టపోయిన అన్నదాతలకు పరిహారం అందించి ఆదుకోవాలని ఎమ్మెల్యే హరీష్‌రావు డిమాండ్ చేశారు. ఈదురు గాలులు, వర్షం వల్ల దర్గపల్లిలో దెబ్బతిన్న మామిడి తోటలను సోమవారం ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గత నెలలో వరుసగా ఐదు సార్లు కురిసిన అకాల వర్షాలతో వరి, మామిడి, కూరగాయ తోటలు దెబ్బతిన్నాయన్నారు. ఆదివారం మరో మారు కురిసిన వర్షానికి సిద్దిపేట నియోజక వర్గంలో 1,800 ఎకరాల్లో మామిడి తోటలకు నష్టం వాటిల్లిందన్నారు. అగ్రికల్చర్, హార్టికల్చర్, రెవిన్యూ అధికారులు ఫిల్డ్‌విజిట్ చేసి నష్ట పరిహారం అందించాలన్నారు. కార్యక్రమంలో సోమిరెడ్డి, సారయ్య, లింగంగౌడ్, రమేశ్‌గౌడ్, మహిపాల్ రెడ్డి, బాలయ్య, భిక్షపతినాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఈదురు గాలులకు ధ్వంసమైన నివాస గుడిసె

ధ్వంసమైన ఇళ్లు



మాదన్నపేటలో ఎగిరిపోయిన ఇంటి పైకప్పు రేకులు

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డిపల్లి పంచాయతీ మదిర గ్రామం మాదన్న పేటలో వీచిన ఈదురు గాలులకు నాలుగు ఇళ్ల పైకప్పు రేకులు ఎగిరిపడ్డాయి. నివాస గుడిసె పూర్తిగా ధ్వంసమైంది. దెబ్బ తిన్న ఇళ్లను ఆర్ఐ వెంకట నర్సయ్య పరిశీలించారు. నష్ట పరిహారం కోసం జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తానని తెలిపారు.

భూ సమస్యలుంటే దరఖాస్తు చేయండి



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

కలెక్టర్ మనుచౌదరి

అక్కన్నపేట(హుస్నాబాద్): భూ సమస్యలు ఉంటే అర్జీలు పెట్టుకోవాలని కలెక్టర్ మనుచౌదరి రైతులకు సూచించారు. అక్కన్నపేట మండల కేంద్రంతో పాటు చౌటపల్లి, బొడిగెపల్లి గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూ భారతి చట్టంలో సాదాబైనామా, ఆర్ఎస్ఆర్‌లో విస్తీర్ణం ఎక్కువ తక్కువ, మ్యుటేషన్, సీలింగ్, ఈనామ్, రికార్డు సవరణ, కౌవులుదారుల సమస్యలు ఇతరత్రా వాటికి పరిష్కారం ఈ చట్టంలో ఉందన్నారు. భూ సమస్యలుంటే తప్పకుండా అర్జీలు పెట్టుకోవాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో సంజీవ్‌రెడ్డి అనే రైతు మామిడి తోటను పరిశీలించారు.అకాల వర్షానికి నేలపాలైన మామిడి కాయలను పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా అకాల వర్షానికి దెబ్బతిన్న పంటల వివరాలను, వాటి నష్ట పరిహారం పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు.

ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు

పైలట్ ప్రాజెక్టు కింద మూడు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి ప్రత్యేక ఫార్మాట్‌లో దరఖాస్తులను స్వీకరించి, రశీదులు అందజేస్తున్నారు. మొదటి రోజు అక్కన్నపేటలో 105, చౌటపల్లిలో 58, బొడిగేపల్లిలో 29 మొత్తం 192 దరఖాస్తులు వచ్చాయి. వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ రామ్మూర్తి, తహసీల్దార్ అనంతరెడ్డి, ఎంపీడీఓ భానోతు జయరాం, ఆర్ఐ యాదగిరి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య, మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం వివరాలు అందించండి

ఆర్డీఓ సదానందం



దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

మిరుదొడ్డి(దుబ్బాక): అకాల వర్షాలతో నష్టపోయిన పంటల పూర్తి వివరాలను అధికారులకు అందించాలని సిద్దిపేట ఆర్డీఓ సదానందం రైతులను కోరారు. మిరుదొడ్డి మండల కేంద్రంతో పాటు, అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని రుద్రారంలో నష్టపోయిన వరి, మొక్కజొన్న, కూరగాయల పంటలను సిద్దిపేట ఆర్డీఓ సదానందం సోమవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూడవెల్లి పరీవాహక పరిధిలో ఇటీవల కురిసిన వడగండ్ల వర్షాలతో 574 మంది రైతులకు సంబంధించిన 1600 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అంచనా వేయడం జరిగిందన్నారు. కలెక్టర్‌కు నివేదికను అందించి నష్ట పరిహారం అందించేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఆయా కార్యక్రమంలో తహసీల్దార్లు ఉదయశ్రీ, మల్లిఖార్జున్‌రెడ్డి, మిరుదొడ్డి మండల వ్యవసాయ అధికారులు మల్లేశం, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు సత్వరం పరిష్కారం

అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

సిద్దిపేటరూరల్: ప్రజలు అందించిన అర్జీలు సత్వర పరిష్కారం దిశగా అధికారులు కృషి చేయాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి గరిమా అగర్వాల్.. అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం అర్జీలు అందిస్తున్న బాధితులకు సత్వరం న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. అర్జీలు పరిశీలించి వాటి పరిష్కారానికి సంబంధించిన పురోగతిపై తనకు తెలియజేయాలన్నారు. పరిష్కారం కోరుతూ భూ సంబంధిత, హౌసింగ్, పింఛన్లు తదితర వాటిపై మొత్తం 75దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో డీఆర్ఓ నాగరాజమ్మ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న గరిమా అగర్వాల్

మా పేర్లపై నమోదు చేయండి

మేము మల్లన్నసాగర్ ప్రాజెక్టుకు చెందిన భూ బాధితులం. గజ్వేల్ మండలం మిస్కామిరాపల్లిలోని వక్ఫ్‌బోర్డు లో 70 మంది కలిసి సుమారు 250 ఎకరాల భూమిని కొనుగోలు చేశాం. ఈ భూమి ఇంకా మా పేరు మీద నమోదు కాలేదు. ఇప్పటికైనా అధికారులు ఆ భూమిని మా పేర్లపై మార్చాలి. ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి.

– మల్లన్నసాగర్ భూ బాధితులు

కార్ల వివరాలివ్వండి

సాక్షి ఎఫెక్ట్..

సిద్దిపేటరూరల్: సాక్షి పత్రికలో ఈనెల 3న ప్రచురితమైన ''అధికార్ల దందా'' కథనానికి జిల్లా యంత్రాంగం స్పందించింది. అధికారులు వినియోగిస్తున్న కార్ల వివరాలను అందించాలని కోరినట్లు కలెక్టరేట్ ఏఓ రెహమన్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని జిల్లా అధికారుల్లో కొందరు వారి సొంతవాహనాలతో పాటు, కుటుంబ సభ్యుల కార్లను వినియోగిస్తూ రూ. వేలల్లో బిల్లులు దండుకుంటున్న క్రమంలో సాక్షి పత్రికలో వివరంగా ప్రచురితమైంది. ఈమేరకు స్పందించిన జిల్లా యంత్రాంగం వారి వాహనాల పూర్తి వివరాలు సేకరించనున్నట్లు అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు మద్దూరు యువకుడు


కార్తీక్ గౌతమ్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): సౌత్‌జోన్ జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ టోర్నమెంట్‌కు మండల కేంద్రానికి చెందిన బేజాడి కార్తీక్ గౌతమ్‌రెడ్డి ఎంపికైనట్లు మెదక్ జిల్లా హ్యాండ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయ్‌బాబు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ సెలక్షన్ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. 9 నుంచి 12 వరకు తమిళనాడు రాష్ట్రంలో జరిగే టోర్నమెంట్ రాష్ట్ర జట్టు తరపున పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గౌతమ్ రెడ్డిని సిద్దిపేట జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కందుకూరి ఉపేందర్ గుప్తా, దామెర మల్లేశం, జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

టేక్మాల్(మెదక్): తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మండలంలోని సంగ్యాతండా పంచాయతీ పరిధిలోని కడిలాబాయి తండాలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. తండాకు చెందిన కున్‌సోత్ మోహన్ కుటుంబ సభ్యులు ఉదయం ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులతోపాటు ఉపాధి హామీ పనులకు వెళ్లారు. పనులు ముగించుకొని ఇంటికొచ్చే సరికి గుర్తు తెలియని దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లో చొరబడ్డారు. బీరువాలోని తులం బంగారం, 35 తులాల వెండి, రూ.15 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కారు, బైకు ఢీ : ఒకరు మృతి

పెద్దశంకరంపేట(మెదక్): కారు, బైకు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన పెద్దశంకరంపేట శివారులో చోటు చేసుకుంది. అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, ట్రైనీ ఎస్‌ఐ అరవింద్ కథనం మేరకు.. భీమన్నపల్లి మురళీ క్రిష్ణ(32), అంజన్నగారి హరీశ్ పెద్దశంకరంపేట వైపు నుంచి మల్కాపూర్ వైపు బైక్‌పై వెళ్తున్నారు. మార్గమధ్యలో రేగోడ్ వైపు నుంచి పేట వైపు వస్తున్న కారు ఢీకొట్టడంతో మురళీ క్రిష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. హరీశ్‌కు తీవ్ర గాయాలు కావడంతో సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

ఇద్దరు మహిళలు అదృశ్యం

ఇంటి నుంచి వెళ్లి..

శివ్వంపేట(నర్సాపూర్) : ఇంటి నుంచి వెళ్లి మహిళ అదృశ్యమైంది. ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి కథనం మేరకు.. మండల పరిధి పోతులబోగూడ గ్రామానికి చెందిన బత్తులు లక్ష్మీ (58) గత నెల 24న పాంబండలో జరిగిన బంధువుల పెళ్లికి వెళ్లింది. రెండు రోజుల ద్వారా ఇంటికొస్తానని చెప్పడంతో కుటుంబ సభ్యులు గ్రామానికి వెళ్లిపోయారు. 26న కుటుంబ సభ్యులు పాంబండలో ఉన్న బంధువులకు లక్ష్మీ గురించి ఫోన్ చేయగా ఉదయమే పోతులబోగూడకి బయలుదేరిందని చెప్పారు. ఇంటికి రాకపోవడంతో పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. లక్ష్మీ కుమారుడు నాగులు సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కుటుంబ కలహాలతో..

గజ్వేల్‌రూరల్: కుటుంబ కలహాలతో వివాహిత అదృశ్యమైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గజ్వేల్‌కు చెందిన జర్రు శారద భర్త చనిపోవడంతో ఏడాది కిందట ప్రమోద్ అనే వ్యక్తిని రెండో పెళ్లి చేసుకుంది. దంపతుల మధ్య గొడవలు జరుగుతుండటంతో మనస్తాపానికి గురై ఇంటి నుంచి వెళ్లిపోయి తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం అందించింది. శారద కోసం తల్లిదండ్రులు తెలిసిన చోట వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రెగ్యులర్ ఈవో కలేనా!

ఇన్‌చార్జ్‌లతోనే ఏడుపాయల ఆలయం

- ఇటీవల రంగారెడ్డి జిల్లాకు ఇన్‌చార్జి ఈవో చంద్రశేఖర్ బదిలీ
- అయినా తప్పని ఉమ్మడి మెదక్ జిల్లా అదనపు బాధ్యతలు
- తలకు మించిన భారంతో సతమతం
- రెగ్యులర్ ఈవో లేక భక్తులకు వసతులు కరువు


చంద్రశేఖర్ అసిస్టెంట్ కమిషనర్


ఏడుపాయల పుణ్యక్షేత్రం

పాపన్నపేట(మెదక్): తెలంగాణలోనే ప్రసిద్ధి చెందిన ఏడుపాయల ఆలయానికి రెగ్యులర్ ఈవో నియామకం కలగానే మిగిలిపోతుంది. మెదక్ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్, ఏడుపాయల ఇన్‌చార్జి ఈవో చంద్రశేఖర్‌ను నాలుగు రోజుల కిందట రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో రెండు జిల్లాల అదనపు కమిషనర్‌గా.. ఏడుపాయల ఇన్‌చార్జి ఈవోగా బహుముఖ బాధ్యతలు నిర్వహించలేక.. తలకు మించిన భారంతో సతమత మవుతున్నారు. తెలంగాణలోనే ప్రసిద్ధి చెందిన ఏడుపాయలకు రెగ్యులర్ ఈవో లేక భక్తులు అవస్థల పాలవుతున్నారు.

రెండు జిల్లాల ఆలయాల బాధ్యతలు

మెదక్ ఉమ్మడి దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న చంద్రశేఖర్ రెండేళ్ల కిందట ఏడుపాయల ఇన్‌చార్జి ఈవోగా బదిలీ అయ్యారు. అప్పటి నుంచి రెండు బాధ్యతలు చూస్తూ వస్తున్నారు. నాలుగు రోజుల కిందట రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. ఇక్కడి నుంచి బదిలీ అయినా పాత పోస్టులు కూడా అలానే ఉంచడంతో పని భారం ఎక్కువైంది. మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట మూడు జిల్లాల్లో కలిసి గుర్తింపు పొందిన 36 పెద్ద దేవాలయాలతోపాటు, చిన్నాచితక సుమారు 3 వేల ఆలయాలు ఉన్నాయి. అలాగే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో సుమారు 6 వేల దేవాలయాల వరకు ఉంటాయని తెలుస్తుంది. వీటన్నింటికీ అసిస్టెంట్ కమిషనర్‌గా చంద్రశేఖర్ బాధ్యతలు నిర్వర్తించాలంటే తలకు మించిన భారమే అవుతుంది.

రూ.లక్షల్లో ఆదాయం ఉన్నా..

తెలంగాణలో ప్రసిద్ధి చెందిన దేవాలయం ఏడుపాయల. 6ఏ టెంపుల్‌గా గుర్తింపు పొందిన వనదుర్గమ్మ ఆలయం దర్శించుకోవడానికి యేటా సుమారు 20 లక్షల మంది భక్తులు వస్తారు. సుమారు రూ.15 కోట్ల ఆదాయం ఉంటుంది. ఆది, మంగళ, శుక్ర వారాల్లో వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. మహాశివరాత్రి జాతరకు సుమారు 12 లక్షల భక్తులు వస్తారు. ఇంతటి ప్రాధాన్యత గల దేవాలయానికి రెగ్యులర్ ఈవో లేకపోవడం దురదృష్టకరమని భక్తులు వాపోతున్నారు. తమ సమస్యలు పరిష్కరించే నాథుడే లేడని అంటున్నారు.

ఏళ్ల కొద్దీ ఇన్‌చార్జ్‌లతో పాలన

2023లో ఈవో సార శ్రీనివాస్ బదిలీ అయిన తర్వాత మోహన్ రెడ్డి వచ్చారు. ఆయన రిటైర్‌మెంట్ తర్వాత అసిస్టెంట్ కమిషనర్ వినోద్ రెడ్డి, క్రిష్ణ ప్రసాద్ వచ్చారు. అప్పట్లో నెల లోపు ముగ్గురు ఈవోలు మారారు. అనంతరం వచ్చిన అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ ఇన్‌చార్జి ఈవోగా కొనసాగుతూ ఇటీవల రంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. అయినా ఆయనకే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పజెప్పారు. బహుముఖ విధులు నిర్వర్తిస్తున్న ఆయన ఏడుపాయలకు పూర్తిగా న్యాయం చేయలేక పోతున్నారని భక్తులు వాపోతున్నారు. గతంలో ఎంతో మంది గ్రేడ్–2 ఈవోలు ఏడుపాయల ఈవోలుగా పని చేశారు. ఈ క్రమంలో గ్రేడ్–2 స్థాయి ఈవోనైనా నియమించి తమ ఇబ్బందులు తీర్చి ఏడుపాయల అభివృద్ధికి తోడ్పడాలని కోరుతున్నారు.

అమ్మానాన్నల కల సాకారం

తొలి ప్రయత్నంలోనే జూనియర్ సివిల్ జడ్జిగా సాహితీ


కోర్టు వద్ద సాహితీ

నంగనూరు(సిద్దిపేట) : సిద్దిపేట జిల్లా నంగనూరు మండల కేంద్రానికి చెందిన మల్యాల సాహితీ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైంది. అమ్మానాన్నల ప్రోత్సాహంతో తొలి ప్రయత్నంలోనే.. 26 ఏళ్ల వయస్సులోనే జూనియర్ సివిల్ జడ్జిగా ఉద్యోగం సాధించింది.

సాహితీ సిద్దిపేట పట్టణంలో ఓ ప్రైవేట్ స్కూల్‌లో పదో తరగతి, హైదరాబాద్‌లో ఇంటర్ చదివింది. బెంగుళూరులోని రెవా యూనివర్సిటీలో 2017–22 వరకు బీబీఏ ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసింది. 2022–24 వరకు హైదరాబాద్‌లోని పడాల రామిరెడ్డి లా కళాశాలలో ఎల్‌ఎల్‌ఎమ్ పూర్తి చేయగా అంతలోనే జూనియర్ సివిల్ జడ్జి నియామకాలకు నోటిఫికేషన్ వచ్చింది. జూన్ 2024లో ప్రిలిమ్స్, నవంబర్‌లో జరిగిన మెయిన్స్‌లో అర్హత సాధించింది. ఏప్రిల్ 2025లో ఇంటర్వ్యూలు అయ్యాయి. అదే నెల 30న జూనియర్ సివిల్ జడ్జి నియామకాలకు సంబంధించి ఫలితాలు విడుదల కాగా మల్యాల సాహితీ ఎంపికైంది. జడ్జిగా ఎంపిక కావాలని పట్టుదలతో సాహితీ 10 నెలల పాటు కష్టపడింది. ప్రతి రోజూ 8 నుంచి రాత్రి 10 గంటల పాటు ఇంటి దగ్గరనే సన్నద్ధమైంది. పుస్తకాల నుంచి తానే సొంతంగా స్టడీ మెటీరియల్‌ను సిద్ధం చేసుకుంది.

మా కలను కూతురు నెరవేర్చింది



మేము ఇంటర్ చదువుతున్న సమయంలోనే మాకు వివాహమైంది. చదువు మధ్యలోనే ఆపేశాం. మా పిల్లలకు ఎప్పుడు చెప్పుబుతుంటాం.. మేము చదువుకోలేకపోయాం.. మీరు ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని. నేడు మా కలను సాహితీ నెరవేర్చింది. మా వంశంలోనే న్యాయవ్యవస్థలో జడ్జి ఉద్యోగం సాధించిన మొదటి వ్యక్తి మా సాహితీ.

– మల్యాల రాజు, అన్నపూర్ణ తల్లిదండ్రులు

వివాహితను కాపాడిన షీ టీమ్ బృందం

అత్తింటి వేధింపులతో ఆత్మహత్యాయత్నం


జ్యోతితో మాట్లాడుతున్న షీ టీమ్ బృందం సభ్యుడు దేవదాస్

నర్సాపూర్ రూరల్: చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడుతున్న వివాహితను షీ టీమ్ బృందం సభ్యులు కాపాడారు. వివరాల్లోకి వెళ్తే.. కొల్చారం మండలం అప్పాజీపల్లి గ్రామానికి చెందిన పిచ్చకుంట్ల జ్యోతి కుటుంబ సభ్యుల వేధింపులు తాళలేక సోమవారం నర్సాపూర్ రాయ రావు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు బయలుదేరింది. చెరువు ప్రాంతంలో స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న షీ టీమ్ బృందం సభ్యులు దేవదాస్, స్వామి సకాలంలో స్పందించారు. వెంటనే వెళ్లి జ్యోతిని కాపాడి నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చారు. జ్యోతి భర్త లింగం, అత్త, మరిదితో పాటు ఇతర కుటుంబ సభ్యులు కొన్నేళ్లుగా వేధింపులకు గురి చేస్తున్నారని పలుమార్లు పంచాయితీ పెట్టినా మారకపోవడంతో విసుగు చెంది ఆత్మహత్య చేసుకుందామని నిర్ణయించుకున్నట్లు తెలిపింది. ఏడేళ్ల కిందట పిచ్చకుంట్ల గ్రామానికి చెందిన లింగంతో వివాహం జరిగిందని, ప్రస్తుతం ఇద్దరు కుమారులు కూడా ఉన్నట్లు చెప్పింది. తల్లిదండ్రులు నర్సాపూర్ లో నివాసం ఉంటారని పేర్కొంది.

నాణ్యమైన మందులు అందించాలి


ఎన్నికైన దేవదాసు, సంతోష్, రాజుగౌడ్

గజ్వేల్‌రూరల్: మెడికల్ దుకాణాలకు వచ్చే ప్రజలకు నాణ్యమైన మందులు అందించి వారి మన్ననలు పొందాలని తెలంగాణ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, మెదక్ జిల్లా అధ్యక్షుడు తొడుపునూరి రాజు పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం గజ్వేల్ ఏరియా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దేవదాసు, ఉపాధ్యక్షుడిగా సంతోష్, జనరల్ సెక్రటరీగా యాదగిరి, రాజుగౌడ్‌లతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అదే విధంగా సీడీఏ జిల్లా జనరల్ సెక్రటరీగా వేముల వెంకటేశ్వర్‌రావును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సరసమైన ధరలకు నాణ్యమైన మందులను అందించడంతోపాటు వారి మన్ననలను పొందాలని సూచించారు. రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సంగారెడ్డి, సిద్దిపేట జిల్లా డీసీఏ సభ్యులు పాల్గొన్నారు.

దళిత యువకుడిపై దాడి అమానుషం

సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీలు


ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని వేచరేణి శివారు ఎల్లదాసునగర్‌కు చెందిన బేడ బుడిగ జంగం దళిత యువకుడిపై బీజేపీ మతోన్మాద ఆర్‌ఎస్‌ఎస్, హిందుత్వ బజరంగ్ దళ్ కార్యకర్తలు దాడి చేయడం అమానుషమని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. సోమవారం ఎల్లదాసునగర్‌కు వెళ్లి బాధితుడితో మాట్లాడి కొత్త దుస్తులు అందించారు. అనంతరం అక్కడి నుంచి పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. దాడికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశాడు. సీపీఎం నాయకులు శశిధర్, సత్తిరెడ్డి, వెంకట్‌మావో, బాల్ నర్సయ్య, యాదగిరి, రవికుమార్, ప్రశాంత్, శారద, రాజు, నాగరాజు, శ్రీహరి, ప్రభాకర్, మల్లేశం, అశోక్, ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

దళిత యువకుడిపై దాడిని నిరసిస్తూ సీపీఐ నాయకులు పట్టణ కేంద్రంలో రాస్తారోకో చేశారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ మాట్లాడుతూ.. దళిత యువకుడిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు భూమయ్య, యాదగిరి, భాస్కర్‌రెడ్డి, నర్సింహా చారి, నర్సయ్య, ఎల్లయ్య, బాపురాజు, సత్తయ్య, రాజు, సీతారామయ్య, యాదయ్య, నర్సింహులు, యాదవ్వ, ఇస్తారి, లచ్చయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత


పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్లు

తూప్రాన్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ శివానందం సోమవారం తెలిపారు. మండలంలోని గుండ్రెడ్డిపల్లి గ్రామ శివారులో హల్దీ వాగు నుంచి అక్రమంగా ఇసుకను ఫిల్టర్ చేసి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారన్న సమాచారం అందింది. ఈ మేరకు దాడి చేసి మూడు ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. ట్రాక్టర్ డ్రైవర్లు పోలీసుల రాకను చూసి పారిపోయినట్లు తెలిపారు. ట్రాక్టర్ యాజమానులు నాగరాజు, సురేశ్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చెరువులో దూకి యువతి ఆత్మహత్య


ప్రియాంక (ఫైల్)

పాపన్నపేట(మెదక్): చెరువులో దూకి యువతి ఆత్మహత్యకు పాల్పడింది.ఈ ఘటన మండల పరిధిలోని మల్లంపేటలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మల్లంపేట గ్రామానికి చెందిన చాకలి మల్లయ్య, శామల దంపతులకు ముగ్గురు ఆడ పిల్లలు. మల్లయ్య కరోనా సమయంలో చనిపోయాడు. తల్లి ఇద్దరు ఆడపిల్లల వివాహాలు చేసింది. బతుకు భారం కావడంతో శ్యామల చిన్న కూతురు ప్రియాంక(20)తో కలిసి హైదరాబాద్‌కి వలస పోయి జీవిస్తుంది. ఇటీవల రెండు నెలల కిందట తల్లీబిడ్డలు స్వగ్రామానికి వచ్చారు. ఈ క్రమంలో సోమవారం ప్రియాంక ఫోన్‌లో మాట్లాడుతూ రెడ్ల చెరువు వద్దకు వెళ్లి నీటిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ప్రేమ వ్యవహారమే ఆత్మహత్యకు కారణమై ఉంటుందని భావిస్తున్నారు.

స్నేహితుల మధ్య గొడవ

ఉరేసుకున్న యువకుడు

న్యాల్‌కల్(జహీరాబాద్): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని మెటల్‌కుంట గ్రామంలో చోటు చేసుకుంది. హద్నూర్ ఎస్‌ఐ చల్లా రాజశేఖర్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన రాజు(32) జహీరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అటెండర్‌గా పని చేస్తున్నాడు. గ్రామానికి చెందిన సుందర్, దిలీప్‌తో కలిసి మెలిసి ఉండేవాడు. రెండు రోజుల కిందట రాజు ఫోన్ పోయింది. తోటి మిత్రులను మీరే తీశారని అడుగగా మాకు తెలీదని చెప్పారు. వినకుండా రాజు వారి బైక్‌ను తీసుకెళ్లాడు. బైక్ విషయంలో స్నేహితులు, రాజుకు మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన ఆదివారం రాజు ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య పాల్పడ్డాడు. భార్య మధురవాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

పాన్ కోసం రోడ్డు దాటుతుండగా..

కారు ఢీకొని వ్యక్తి మృతి

మునిపల్లి(అందోల్): గుర్తు తెలియని కారు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బుదేరాలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజేశ్ నాయక్ కథనం మేరకు.. గుల్బర్గాకు చెందిన విఠల్‌రావు (75) ట్రాన్స్‌ఫోర్ట్ లారీ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. పాన్ కోసం బుదేరా చౌరస్తా సమీపంలో రోడ్డు దాటుతున్నాడు. జహీరాబాద్ నుంచి హైద్రాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ట్రాన్స్ ఫోర్ట్ డ్రైవర్ అక్బర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి

చేర్యాల(సిద్దిపేట): ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఆకునూరులో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన శిగుల్ల కనకయ్య(52) కొంత కాలంగా ఆరోగ్యం బాగా లేక ఆస్పత్రిలో చేరి చికిత్స పొందాడు. ఇటీవల మద్యం తాగుతుండటంతో భార్య మందలించింది. దీంతో మనస్తాపం చెంది శనివారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు.

సాగు అంశాలపై అవగాహన కల్పించడానికే..

- 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం
- వ్యవసాయ కమిషన్ సభ్యుడు రాములు నాయక్


మాట్లాడుతున్న రాములు నాయక్

రామాయంపేట(మెదక్): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో రైతులకు అందించడానికి వీలుగా ప్రభుత్వం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమాన్ని చేపట్టిందని వ్యవసాయ కమిషన్ సభ్యుడు రాములు నాయక్ పేర్కొన్నారు. మండలంలోని రాయిలాపూర్ రైతువేదికలో సోమవారం కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. చిన్నకారు, సన్నకారు రైతుల లభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని, క్షేత్ర స్థాయిలో రైతుల సమస్యలు గుర్తించి, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి కమిషన్ కృషి చేస్తుందన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయంలో జరుగుతున్న పరిశోధన ఫలితాలను రైతులకు వివరించి వారికి చైతన్యపర్చడానికి అవగాహన శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి విన్సెంట్ వినయ్ మాట్లాడుతూ.. రైతులకు సాంకేతిక సలాహాలను అందిస్తే పెట్టుబడులు తగ్గడంతోపాటు అధిక ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. 13వ తేదీ వరకు కొనసాగే అవగాహన శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శోభారాణి, రామాయంపేట వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు రాజ్‌నారాయణ, డివిజన్ పరిధిలోని వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములు కబ్జా

- మీర్జాపూర్, తోటపల్లి శివారు సరిహద్దులో రైతుల ఆక్రమణలు
- కుంట కట్టలు ధ్వంసం, నీటి కాల్వలు పూడ్చివేతలు
- పూడికతీత పనులు చేపడితేనే మేలు


వైదేరు కుంట కట్టను ధ్వంసం చేసి చదును చేస్తున్న యంత్రాలు

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వం పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను సమీప రైతులు ఆక్రమణలకు పాల్పడుతూ ప్రశ్నిస్తే బెదిరింపులకు గురి చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేదల భూములకు సాగు నీరు సౌకర్యం లేకపోవడంతో పంటలు వేయక బీడు వారడంతో ఇదే ఇదునుగా భావించిన రైతులు హద్దు రాళ్లు జరిపి ఆక్రమిస్తున్నారు.


కరువుతో సాగుకు దూరం

తోటపల్లి రెవెన్యూ పరిధిలో వైదేరు కుంట దగ్గర పేదలకు 2.20 ఎకరాల అసైన్డ్ భూములను ప్రభుత్వం పేదలకు ఇచ్చింది. ఒకప్పుడు కుంట తూము పారకంతో పంటలు పండించిన రైతులు కరువుతో కుంటలు ఎండిపోవడంతో సాగు చేయలేకపోతున్నారు. పేదలకు ఇచ్చిన భూమిలో చెట్లను అమ్ముకోవడం, గెట్టు జరిపి భూమి కలుపుకోవడం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు భూ సర్వే చేసి పేదల భూములకు హద్దు రాళ్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కుంట కట్టలు ధ్వంసం..

హుస్నాబాద్ మండలంలో చిన్న నీటి వనరులను అభివృద్ధి చేయడానికి గొలుసు కట్టు కుంటలు, చెరువులను నిర్మించారు. ఇవి పూడికతో నిండిపోవడంతో గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకంలో భాగంగా పూడిక పనులు చేయించి చెరువు, కుంటలకు పూర్వ వైభవం తీసుకొచ్చింది. చిన్న నీటి కుంటలను సమీప రైతులు కట్టలను ధ్వంసం చేసి బఫర్ జోన్ గొలుసు భూమిని ఆక్రమిస్తున్నారు. శుక్రవారం మీర్జాపూర్, తోటపల్లి శివారు సరిహద్దు లోని వైదేరు కుంట కట్టను ఓ రైతు ధ్వంసం చేసి చదును చేయడంతో పొరుగు రైతులు అడ్డుకొని ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి వచ్చిన అధికారులు జేసీబీ, డోజర్ తాళాలు తీసుకొని వెళ్లిపోయారు. తోటపల్లిలో మాసాని కుంట, ఎర్ర కుంట, వట్టే కుంట, మీర్జాపూర్‌లోని మంచీళ్ల కుంట శిఖం భూములను రైతులు ఆక్రమించి చదును చేస్తున్నారు. 20 చెరువులు, కుంటలకు ఒక ఏఈని ఇరిగేషన్ అధికారులు నియమించినా అభివృద్ధి పనులకు నిధులు లేకపోవడంతో పర్యవేక్షణ లేకుండా పోతుందని ఆరోపిస్తున్నారు.

హద్దులు ఏర్పాటు చేయాలి



మా ఎస్సీలకు వైదేరు కుంట కింద 2.20 ఎకరాలను ప్రభుత్వం అసైన్డ్ పట్టాలు ఇచ్చింది. కొద్ది రోజులు కుంట నీరుతో పంటలు సాగు చేసిన కరువుతో తూములు కూలిపోవడంతో నీటి కాల్వలు, అలుగును ధ్వంసం చేయడంతో మాకు నీళ్లు లేకుండా పోయాయి. కుంట కట్టను ధ్వంసం చేసి మా భూమిని ఆక్రమించే రైతులపై చర్యలు తీసుకోవాలి.

– మేదిని వెంకటస్వామి, గాంధీనగర్

కుంట కట్ట గొలుసు వరకు బఫర్ జోనే..



చెరువు, కుంట కట్టల కింద గొలుసు వరకు బంఫర్ జోన్ భూములే ఉంటాయి. వీటిని ఎవరు చదును చేయరాదు, ఆక్రమించరాదు. వైదేరు కుంట కట్ట ధ్వంసం చేసిన విషయం విచారణ జరిపి వాహనాలను స్వాధీనం చేసుకొని రైతు పై కేసు నమోదు చేయిస్తాం. శిఖం, నీటి కాల్వలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– శ్రీధర్, ఏఈ ఇరిగేషన్

46 రోజుల తర్వాత తల్లిదండ్రుల చెంతకు విద్యార్థి

చదువుపై ఇష్టం లేక వెళ్లిపోయానని చెప్పిన బాలుడు

వట్‌పల్లి (అందోల్): హాస్టల్ నుంచి 46 రోజుల కిందట అదృశ్యమైన విద్యార్థిని సోమవారం వట్‌పల్లి పోలీసులు పట్టుకొని తల్లిదండ్రులకు అప్పగించారు. ఎస్‌ఐ శ్రీకాంత్ కథనం మేరకు.. రేగోడ్ మండలం పెద్ద తండాకు చెందిన మెగావత్ లక్ష్మీ, రవి దంపతుల కుమారుడు మండల పరిధిలోని దేవునూర్ బాలుర హాస్టల్‌లో ఉంటూ అక్కడే ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఉగాది పండుగ సందర్భంగా మార్చి 20న హాస్టల్ నుంచి ఇంటికి రాలేదు. విద్యార్థి తల్లిదండ్రులు హాస్టల్ వద్దకు వెళ్లి కుమారుడు ఎక్కడికి వెళ్లాడని హాస్టల్ వార్డెన్‌ను నిలదీయగా ఆచూకీ లభించలేదు. ఏప్రిల్ 4న వట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. విచారణలో భాగంగా విద్యార్థి హైదరాబాద్‌లో ఉంటున్నాడని దర్యాప్తులో తేలింది. సోమవారం విద్యార్థిని వట్ పల్లికి తీసుకొచ్చి విచారించగా చదువుకోవడం ఇష్టం లేకనే హాస్టల్ నుంచి వెళ్లిపోయినట్లు తెలిపాడు. ఆ తర్వాత తల్లిదండ్రుల సమక్షంలో అతడికి కౌన్సిలింగ్ చేసి వారికి అప్పగించారు.